క్లుప్తంగా

నేత్రపర్వంగా కల్యాణోత్సవం



సోమశిల : అనంతసాగరం మండలం కచిరి దేవరాయపల్లిలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం భానుప్రకాశాచార్యుల ఆధ్వర్యంలో తొలుత దేవదేవేరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

మర్యాదపూర్వకంగా..



ఆత్మకూరు: వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆత్మకూరులో త్వరలో ఏర్పాటు చేయనున్న తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వానించారు. ఆయన వెంట ఆత్మకూరు నాయకులు ఉన్నారు.

విద్యాసామగ్రి వితరణ



ఆత్మకూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆత్మకూరు ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ గురువారం విద్యాసామగ్రిని వితరణ చేసింది. ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఏబీ శివకుమార్, ఐసీఈయూ అధ్యక్షుడు శ్యామ్‌ప్రభాకర్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు నోట్‌పుస్తకాలు, పెన్సిళ్లు, రబ్బర్లతో పాటు బిస్కెట్ ప్యాకెట్లు, పండ్లు, చాక్‌లెట్లు అందజేశారు. ఎల్ఐసీ యూనియన్ కార్యదర్శి ఏవీ రమణయ్య, జీ లక్ష్మీనారాయణ, ఎస్ ప్రవీణ, ఎం రమాదేవి, జయసుధ, సౌజన్య, దామిని, గాయత్రి, ఆనంద్, ఉపాధ్యాయులు మాలకొండమ్మ, లక్కు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఆత్మకూరు:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎంపీపీ పాఠశాల (తూర్పు)లో ఉపాధ్యాయినులు ఎస్వీ ప్రసూన, డీ శశికళను విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించారు. శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. హెచ్ఎం ఎస్‌కే జిలానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై ఎస్సై ఎం శివశంకర్‌రావు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. లారీలపై ప్రయాణికులను తరలిస్తున్న లారీ డ్రైవర్లను గుర్తించి హెచ్చరించారు. లారీలపై ప్రయాణిస్తున్న వలస కూలీలను కిందకు దింపి బస్సుల్లో పంపారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లకు జరిమానా విధించారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులను హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

రెండు మోటార్ సైకిళ్ల ఢీ

• ఇద్దరికి గాయాలు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం వద్ద నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై గురువారం రెండు మోటార్ సైకిళ్లు అదుపుతప్పి ఢీకొనంతో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. పొంగూరుకు చెందిన పొగాకు రైతు పార్లపల్లి మల్లికార్జునరెడ్డి మోటార్‌సైకిల్‌పై డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి వస్తున్నాడు. పొగాకు వేలం కేంద్రం వద్ద మలుపు తిరుగుతుండగా వెనుకగా వస్తున్న మరో ద్విచక్ర వాహనచోదకుడు అదుపుతప్పి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మల్లికార్జునరెడ్డి తీవ్రంగా గాయపడగా, హైవే అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అనుమసముద్రంపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ అన్నారు. మండలంలోని తెల్లపాడులో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారని, మరో అడుగు ముందుకు వేసి ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. న్యాయవాది కేవీ శేషారెడ్డి, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పెంచలనరసయ్య, ఎస్సై నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు భద్రత కరువు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులు రాత్రి వేళల్లో రోడ్లపై ప్రమాదపుటంచున పారిశుధ్య పనులు చేపడుతున్నారు. రేడియం స్టిక్కర్లు కలిగిన జాకెట్లను ధరించక ప్రమాదాలపాలవుతున్నారు. మున్సిపల్ అధికారులు జాకెట్లను సమకూర్చకపోవడం..సమకూర్చిన వాటిని కార్మికులు ధరించకపోతుండడంతో వారి ప్రాణాలకు రక్షణ కరువవుతోంది.



ఉదయగిరి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్‌లోనే పనులు చేపడుతున్న పారిశుధ్య కార్మికులు

కావలి: మున్సిపాలిటీలో 40 మంది శాశ్వత, 300 మంది తాత్కాలిక పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వీరు ప్రతిరోజూ వేకువన 4.30 గంటలకు విధులకు హాజరవుతుంటారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సూచించిన ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తుంటారు. అందులో సగం మందికి పైగా పట్టణంలోని ప్రధాన రోడ్లపై పారిశుధ్య పనులు చేపడుతుంటారు. మిగిలిన వారు నివాస ప్రాంతాల వద్ద విధులు నిర్వహిస్తుంటారు. పట్టణంలోని ఉదయగిరి ఫ్లైఓవర్ బ్రిడ్జి ,తుమ్మలపెంట రోడ్డు, జనతాపేట, ఐదులాంతర్ల సెంటర్, జెండాచెట్టు సెంటర్, ఒంగోలు బస్టాండ్ సెంటర్, కూరగాయల మార్కెట్ సెంటర్, శివాజీ సెంటర్, ప్రభుత్వ ఆస్పత్రి కూడలి, ఆర్టీసీ బస్టాండ్, రామ్మూర్తిపేట, శాంతినగర్, పుల్లారెడ్డినగర్, బృందావనం కాలనీ తదితర ప్రధాన రోడ్లపై వాహనాలు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు వేకువజాము నుంచే రోడ్లను శుభ్రపరిచే పనుల్లో తలమునకలై ఉంటారు. రోడ్లపై పారిశుధ్య పనులు చేపట్టే కార్మికులు రేడియం స్టిక్కర్లు కలిగిన జాకెట్లను విధిగా ధరించాల్సి ఉంటుంది. అయితే కార్మికులు వాటిని ధరించకపోతుండడంతో వేగంగా వెళ్లే వాహనదారులు దగ్గరకు వచ్చే వరకు గుర్తించలేకపోతున్నారు. ఈ కారణంగా కొన్ని సందర్భాల్లో కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది రేడియం స్టిక్కర్లు కలిగిన జాకెట్లను సమకూర్చకపోవడం...సమకూర్చిన వాటిని కార్మికులు ధరించకపోతుండడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోంది. రోడ్లపై పారిశుధ్య పనులు చేపట్టేటప్పుడు వాహనాదారులకు తెలిసేలా సూచిక బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలి. పారిశుధ్య కార్మికులకు రేడియం స్టిక్కర్లు కలిగిన జాకెట్లను పూర్తి స్థాయిలో సమకూర్చాలి.ట్రాఫిక్ డైవర్షన్‌కు ప్రత్యేకంగా ఒకరిని కేటాయించాలి. ఇవేవీ అనుసరించకపోవడంతో పారిశుధ్య కార్మికుల ప్రాణాలకు రక్షణ కరువైంది.



రాత్రి వేళ సేఫ్టీ జాకెట్ లేకుండానే రోడ్డును శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు

కార్మికుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పారిశుధ్య కార్మికులు రోడ్లపై పనులు చేపట్టే సమయంలో వాహనదారులకు తెలిసిలే ట్రాఫిక్ కాన్స్‌ను ఏర్పాటు చేయాలి. వాహనాలను మళ్లించడానికి, వాహనదారులకు సంకేతాలు ఇవ్వడానికి విధిగా ఒక వ్యక్తి విధులు నిర్వర్తించాలి. ఇవన్నీ మున్సిపల్ అధికారులే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమకూర్చాలి. కార్మికులకు రేడియం స్టిక్కర్లు కలిగిన జాకెట్లు ఇస్తున్నా మన్నికైనవి కాకపోవడంతో కొద్దిరోజులకే ధరించడానికి సాధ్యపడడం లేదు. –బండారు రాజేష్, పారిశుధ్య కార్మికుల నాయకుడు

కార్మికుల భద్రతపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల భద్రత విషయంలో రాజీపడేదిలేదు. వారి భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెడుతాం. నాణ్యతతో కూడిన రేడియం స్టిక్కర్లు కలిగిన జాకెట్లను కొనుగోలు చేసి అందజేస్తాం.ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లపై పనులు చేపట్టే సమయంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. –శ్రీనివాసరావు, ఇన్‌చార్జి కమిషనర్,

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



కలిగిరి: నాగసముద్రంలోని పురాతన నాగమల్లేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. సుమారు 70 ఏళ్లుగా ఆలయం శిథిలావస్థలో ఉంది. ఆలయ దుస్థితిని గ్రామస్తులు, స్థానిక నాయకులు ఇటీవల ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌తో మాట్లాడి ఆలయ పునర్నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేయించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ ఆరిముల్ల నారాయణ, వైస్‌చైర్మన్ మాల్యాద్రి గ్రామస్తులతో కలిసి ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారకుడు కర్రా భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పద్మమ్మకు ఆదర్శ మహిళా పురస్కారం



ఆత్మకూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని దమ్ము పద్మమ్మకు కోవిద సహృంద ఫౌండేషన్ 'సావిత్రి బాయి పూలే ఆదర్శ మహిళా సేవా' పురస్కారం లభించింది. పల్నాడు జిల్లా నరసారావుపేటలో ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ అనూహ్యరెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మమ్మకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. మూఢనమ్మకాల నిర్మూలన, సమసమాజ స్థాపనకు పద్మమ్మ చేస్తున్న కృషిని గుర్తించి కలెక్టర్ శివశంకర్ చేతులు మీదుగా అవార్డును అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం చేస్తామని నమ్మించి మోసం

ఉదయగిరి: ఓ చిన్నారికి ఆయుర్వేద వైద్యం ద్వారా మాటలు వచ్చేలా చేస్తామని తల్లిదండ్రులను నమ్మించి గుర్తుతెలియని వ్యక్తులు నగదు, సెల్‌ఫోన్‌తో సహా ఉడాయించారు. పట్టణంలోని బీసీకాలనీలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు..బీసీ కాలనీకి చెందిన సయ్యద్ సుబానీ, నూర్జహాన్ దంపతులు. వారి ఏడేళ్ల కుమారుడు ఇంతియాజ్‌కు చిన్నతనం నుంచి మాటలు రావడం లేదు. ఈ విషయం తెలుసుకున్న ఇద్దరు వ్యక్తులు బుధవారం వారి ఇంటి వద్ద కొచ్చారు. తాము చెన్నైకు చెందిన ఆయుర్వేద వైద్యులమని, మీ కుమారుడికి మందులతో మాటలు వచ్చేలా చేస్తామని నమ్మించారు. చిన్నారికి అవసరమైన మందుల కోసం ముందుగా రూ.15 వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో సుబానీ ఫోన్‌పే ద్వారా రూ.10 వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. మరో రూ.5 వేలు వారి చేతికి అందజేశాడు. అనంతరం సదరు వ్యక్తులు వైద్యానికి సంబంధించి యాప్‌ను సెల్‌ఫోన్‌లో అప్‌లోడ్ చేసుకుని మందులు తీసుకొస్తామని చెప్పి సెల్‌ఫోన్‌ను తీసుకున్నారు. గురువారం నర్సు మీ ఇంటి వద్దకొచ్చి వైద్యం చేస్తుందని చెప్పి వెళ్లారు. గురువారం వైద్యసిబ్బంది ఎవరూ రాకపోవడంతో సుబానీ వారికి ఫోన్ చేయగా ఆదివారం వస్తామని తెలిపారు. దీంతో మోసపోయామని గ్రహించి ఉదయగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పొగాకు వేలం ప్రారంభం



కలిగిరి: పొగాకు వేలాన్ని ప్రారంభిస్తున్న వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్



మర్రిపాడులో వేలాన్ని ప్రారంభిస్తున్న వేలం నిర్వహణాధికారి రాజశేఖర్

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో 2022–23 పంట కాలానికి సంబంధించి పొగాకు వేలం గురువారం ప్రారంభమైంది. తొలి రోజు 18 బేళ్లు వేలానికి రాగా, కిలో రూ.200 వంతున కొనుగోలు చేశారు. వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ వేలాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, కూలీల కొరతతో రైతులకు ఖర్చులు అధికమయ్యాయని తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గిట్టుబాటు ధర అందించాలని పొగాకు కంపెనీల ప్రతినిధులను కోరారు. రైతు సంఘ నాయకులు గాలి నరసపనాయుడు, మూలి వెంగయ్య మాట్లాడుతూ ఈ ఏడాది తుపాన్‌తో పొగాకు పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అయినా రైతులు వ్యయప్రయాసాలకోర్చి పంటను సాగు చేశారని, పొగాకు సగటు ధర రూ.200 తగ్గకుండా చూడాలని కోరారు. కాగా తొలిరోజున ఐదు కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పొగాకు వేలం గురువారం ప్రారంభమైంది. ఉదయం వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి వేలాన్ని ప్రారంభించారు. తొలిరోజు రైతులు 45 పొగాకు బేళ్లను తీసుకురాగా, ఐటీసీ 29, జీపీఐ 4, అలియన్స్ కంపెనీ 4, పొలిశెట్టి కంపెనీ 2, పీటీపీ కంపెనీ 6 బేళ్ల చొప్పున కొనుగోలు చేశాయి. కిలో పొగాకు రూ.200 పలికింది.

పోలీస్ స్టేషన్ తనిఖీ

మర్రిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఐజీ త్రివిక్రమవర్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పోలీస్‌సిబ్బందితో ముచ్చటించారు. పోలీసు సిబ్బందిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఆయన వెంట ఎస్పీ విజయారావు, ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, సీఐ నాగేశ్వరరావు, మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి ఉన్నారు.

పవర్‌స్ప్రేయర్ల పంపిణీ



వింజమూరు: నేరేడుపల్లికి చెందిన రైతులకు కాకర్లచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ గురువారం పవర్‌స్ప్రేయర్లు పంపిణీ చేశారు. అనంతరం ఎస్సీ కాలనీకి చెందిన నూతన వధూవరులకు రూ.10వేలు పెళ్లికానుకగా అందజేశారు. అనాథ కొండలరావు కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మి శ్రీను, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి



జలదంకి:బ్రాహ్మణక్రాకలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి



చేజర్ల మండలం టీకేపాడులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అల్లూరులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి: తూర్పురాయలసీమ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డికి మద్దతుగా గురువారం వారు పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, పందిటి కామరాజు, కుందుర్తి కామయ్య, కనుపర్తి రాజశేఖర్, యేగూరు చిన్నపుల్లయ్య పాల్గొన్నారు.

బిట్రగుంట: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు మద్దిబోయిన వీరరఘు యాదవ్ , గండూరి శ్రీనివాసులు, సుందర్‌రాజు, శేఖర్, షమీవుల్లా, బొంత సుధీర్, నిర్మల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అల్లూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా నగర పంచాయతీలో నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. సీనియర్ నాయకుడు దండా కృష్ణారెడ్డి, నాయకులు నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్ రెడ్డి, షేక్ ఉస్మాన్‌షరీఫ్, నిమ్మల భాస్కర్, బత్తల సుధాకర్, షేక్ రసూల్, దాసరి పోలయ్య, షేక్ జంషీర్, రాజేష్, నిరంజన్, హరీష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా పట్టణంలోని 7,8 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకట రమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు పుచ్చలపల్లి రాధిక, మహబూబ్ బాషా, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా మండల జేసీఎస్ కో ఆర్డినేటర్ పులిమి వెంకట రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పానుగోడు, దూబగుంట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ రియాజ్‌అహ్మద్, నాయకులు చిలుకూరు బ్రహ్మారెడ్డి, మున్నా అచ్చిరెడ్డి, శేఖర్‌రెడ్డి, సింగారెడ్డి వెంకటేశ్వర్లు, గోగిరెడ్డి యానాదిరెడ్డి, సింగారెడ్డి వసంత, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, మండల జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి ఆదూరుపల్లిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. తూర్పుకంభంపాడులో మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, చప్పిడి రామకృష్ణయ్య, ప్రసాద్‌రెడ్డి ప్రచారం చేశారు.

ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా మండలంలోని వాశిలి, బండారుపల్లి, రామస్వామిపల్లి, వెన్నవాడ, గండ్లవేడు, పడకండ్ల, తదితర గ్రామాల్లో మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. బోయలచిరివెళ్ల సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు సానా వేణుగోపాల్‌రెడ్డి, దశించర్ల ప్రసాద్, రేవూరు విజయ నరసింహారెడ్డి, ధనాల రమేష్‌నాయుడు, బొద్దు గిరినాయుడు, జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా కుర్రపల్లి, శకునాలపల్లి, బోడబండ ప్రాంతాల్లో సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

సీతారామపురం: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతరెడ్డి సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనరు బాలినేని మాబయ్య సీతారామపురం, బసినేనిపలి, గంధంవారిపల్లి పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వింజమూరు: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా లెక్కలవారిపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, నాయకులు అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, సూరం వినోద్‌కుమార్‌రెడ్డి, బయ్యపురెడ్డి విజయకృష్ణారెడ్డి, మద్దూరు బాలకృష్ణారెడ్డి, అంకినపల్లి నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి బ్రాహ్మణక్రాక, బీకే అగ్రహారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అలాగే వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి వేములపాడు, కోదండరామపురం, సోమవరప్పాడు గ్రామాల్లో ప్రచారం చేశారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఆత్మకూరురూరల్: బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కుట్టుబోయిన బ్రహ్మానందానికి మద్దతుగా బట్టేపాడు, నల్లపరెడ్డిపల్లి గ్రామాల్లో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

ఆత్మకూరు: టీడీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు పట్టణంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, సీనియర్ నాయకులు చంద్రా వెంకట సుబ్బానాయుడు, సీహెచ్ తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: తూర్పురాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఎల్‌సీ రమణారెడ్డిని ఆశీర్వదించాలని ఆయన తనయుడు అన్వేష్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన ఉదయగిరిలో ఏపీటీఎఫ్ బీటీఏ, సీపీఏ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎండీ ఖాజా, ఓంకారం శ్రీనివాసరాజు, తదితరులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు జ్యోతి శ్రీనివాసులు, ఓబులేసు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితం



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి కరీష్మా

వరికుంటపాడు: ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితమని మండల వైద్యాధికారిణి కరీష్మా తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం కింద 11 మంది గర్భిణులకు గురువారం ఆమె వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్యజాగ్రత్తలను సూచించారు. రక్తహీనత తలెత్తకుండా పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు చేయించుకుని ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ, స్టాఫ్ నర్సు రోజారమణి, సిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలపై అపోహలు వీడాలి



మాట్లాడుతున్న రాఘవేంద్రశర్మ

వరికుంటపాడు: పాడిరైతులు గాలికుంటు వ్యాధి నియంత్రణా టీకాలపై అపోహలు వీడి పశువులకు వేయించి వాటిని కాపాడుకోవాలని మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్ రాఘవేంద్ర శర్మ సూచించారు. తోటలచెరువుపల్లిలోని రైతులకు గాలికుంటు నియంత్రణా టీకాలపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. ప్రభుత్వం పాడిరైతుల శ్రేయస్సు దృష్ట్యా నెలాఖరు వరకు ఉచితంగా గాలికుంటు టీకాలు వేస్తోందని తెలిపారు. అనంతరం గొల్లపల్లి, కొండాయపాళెం గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏహెచ్‌ఏలు కామిని, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ మహోత్సవం జయప్రదానికి పిలుపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉదయగిరి: నెల్లూరులోని కొండాయపాళెం సెంటర్లో యాదవ భవన్ నిర్మాణానికి ఈ నెల 12న భూమిపూజ నిర్వహించనున్నట్లు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు బొమ్మి నాగకిషోర్‌యాదవ్ తెలిపారు. పట్టణంలోని చెంచలబాబుయాదవ్ అతిథి గృహంలో మండల యాదవ సంఘ నాయకులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం భూమి పూజకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ భవన్‌లో విద్యార్థుల సౌకర్యార్థం 70 వసతి గదులు, మినీ ఫంక్షన్ హాల్, కల్యాణ మండపం, యాదవ సంఘాలకు కార్యాలయ గదుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. భూమి పూజ మహోత్సవానికి ఎంపీ బీద మస్తాన్‌రావు, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, తదితర ప్రముఖులు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారని చెప్పారు. జిల్లాలోని యాదవులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యాదవ సంఘ నాయకులు పాముల రమణయ్య, ఆనంగి రమణయ్య, బయ్యన్న, బొజ్జా నరసింహులు, శివకృష్ణ, వెంకటేశ్వర్లు, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాళమ్మ విగ్రహ ప్రతిష్ట



వింజమూరు: గుండెమడకలలో నూతనంగా నిర్మించిన అంకాళమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టను గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఆలయశుద్ధి, గణపతి పూజ నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు.మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. గుండెమడకల పరిసర గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పరిమితంగా పురుగు మందులు వాడాలి

ఆత్మకూరురూరల్: రైతులు వ్యవసాయాధికారుల సూచనలకు అనుగుణంగా పంటలకు పరిమిత మోతాదులోనే పురుగుమందులు వినియోగించాలని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ సూచించారు. మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లిలో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడారు. విచ్చల విడిగా పురుగు మందులు వాడితే అనేక దుష్పరిణామాలు తలెత్తుతాయని తెలిపారు. ఏఓ కిషోర్‌బాబు, ఎంపీఈఓ ఇంద్రాణి పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు ఆదర్శ పాఠశాల, దేపూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సరస్వతి పూజను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పూజల్లో పాల్గొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ఫలహారాలను పంచిపెట్టారు.